క్లుప్తంగా

విద్యార్థినికి ఎంపీ మోపిదేవి ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: నిజాంపట్నం గ్రామానికి చెందిన తెనాలి జ్యోతి అనే విద్యార్థినికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తన వ్యక్తిగత కార్యాలయంలో సోమవారం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతోన్న జ్యోతి ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ మోపిదేవి ఆర్థిక సాయం అందించి, ఆమె చదువుకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

విద్యార్థులకు రక్త నమూన పరీక్షలు

రేపల్లె: విద్యార్థులు తమ రక్త నమూనాలు తెలుసుకోవాలని ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థల డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. పట్టణంలోని జాన్స్ హైస్కూలులో ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు రక్త నమూన పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ గ్రూపులను వారికి తెలియజేశారు. రక్తన మూన తెలిసి ఉంటే ఆపత్కాలంలో ఇతరులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలపై హెచ్‌ఎంలతో ఎంఈఓ సమీక్ష



భట్టిప్రోలు: మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో నీలం దేవరాజు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌పీ ట్యాబ్‌ల పంపిణీ, మధ్యాహ్న భోజనం, పాఠశాలల పరిశుభ్రత, అకడమిక్ మానిటరింగ్ అంశాలు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసుల నిర్వహణ వంటి అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో భట్టిప్రోలు టీఎంరావు, పెదపులివర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పాఠశాల ఏర్పాటు చేయాలి



భట్టిప్రోలు: భట్టిప్రోలులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో.. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రమైన భట్టిప్రోలులో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వ విద్యా సంస్థ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు మొహుద్దీన్, జగదీష్, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాంజనేయులు మృతికి సంతాపం

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు పోలా రామాంజనేయులు హఠాన్మరణంపై భట్టిప్రోలు మండల చేనేత కార్మిక సంఘ నాయకులు సోమవారం ఉదయం తీవ్ర సంతాపం తెలిపారు. రామాంజనేయులు చేనేత ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించడమే కాక తన కుటుంబ సభ్యులు ప్రజా ఉద్యమాలలో భాగస్వామ్యులయ్యేలా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యన్నారాయణ, డి.సత్యన్నారాయణ, భట్టిప్రోలు మండల కమిటీ నాయకులు ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు



బాపట్లటౌన్: పట్టణ సీఐగా యు.శ్రీనివాసులు సోమవారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన 2019లో సీఐగా పదోన్నతి పొందారు. సింగరాయకొండ, తెనాలి రూరల్, త్రీ టౌన్‌లో పనిచేశారు. ప్రస్తుతం వీఆర్ నుంచి బదిలీపై బాపట్ల టౌన్‌కు వచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో విధులు నిర్వర్తించేలా చూస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

- వరికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి
- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి కొరత
- రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య



పిట్టవానిపాలెంలో మాట్లాడుతున్న ఏఓ సత్యానంద్

కొల్లూరు: కృష్ణా నదిలో నీటి లభ్యత స్వల్పంగా ఉన్న నేపథ్యంలో సాగు నీటి వినియోగంలో ఖరీఫ్ పంటల రైతులు పొదుపు పాటించడం అవసరమని నీటి పారుదల శాఖ ఏఈ డి.సాంబశివరావు అన్నారు. సోమవారం కొల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆ శాఖ సిబ్బందితో సాగునీటి లభ్యతపై ఆయన సమావేశం నిర్వహించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటి విడుదల స్థాయి తగ్గడంతో పశ్చిమ బ్యాంక్ కెనాల్ పరిధిలోని దిగువ ప్రాంతాలకు సాగు నీటిని అందించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సాగునీటి కొరతను అధిగమించడానికి ఇప్పటి వరకు వరి నాట్లు వేయని ప్రాంతంలో రైతులు ఆరు తడి పంటలు సాగు చేసుకునే విధంగా ఏఈఓలు అవగాహన కల్పించాలని సూచించారు. పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ కారణంగా సాగునీరు దిగువకు సక్రమంగా సరఫరా అవడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వెంటనే పరిష్కరిస్తానని ఏఈ తెలిపారు. సాగు నీరు పొలాలకు చేరకపోవడానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద ఏటా కాలువల్లో చేపడుతున్న పూడిక తీత పనులు కూడా ఓ కారణమని, ఈ పనుల కారణంగా కాలువల్లో లోతు పెరిగి, చివరి ఆయకట్టుకు నీరు చేరని పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి హామీ పథకం పనుల విషయంలో ప్రతిపాదనల మేరకే పనులు చేపట్టే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నర్ర బుల్లిబాబు, ఏఓ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి..

పిట్టలవానిపాలెం: సాగునీటి కొరత కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సత్యానంద్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కేడబ్ల్యూడీ పరీవాహక ప్రాంతంలోని చివరి భూములకు సాగరునీరు అందించడం సాధ్యం కాదని, నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేసిన నేపథ్యంలో వరిసాగును ఇక నుంచి ప్రోత్సహించరాదన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికే సాగు చేసిన వారికి వారాబందీ పద్ధతి ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గతేడాది పిట్టలవానిపాలెం మండలంలో 11,849 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 10,917 ఎకరాలలో సాగు చేసినట్లు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతేడాది కంటే ఈ ఏడాది 932 ఎకరాలలో వరి సాగు కాలేదని ఏఓ చెప్పారు. ఈ 932 ఎకరాల రైతులు వీలును బట్టి ఆరుతడి పంటలైన మినుము, పెసర తదితర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ శేషమాంబ, సర్పంచ్‌లు యేట్ర అశ్వినిరెడ్డి, మంతెన గంగరాజు, శ్యామల నాగిరెడ్డి, కూసంపూడి దేవేంద్రరాజు, మండే విజయ్‌కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

సాగు నీరు అందించాలి

నగరం: రైతులకు సక్రమంగా సాగునీటిని అందించాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సాగునీటిపై ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఇరిగేషన్ ఏఈ కె.రవిబాబు మాట్లాడుతూ జలాశయాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వారబంది విధానంలో సాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వరి సాగు చేసిన రైతులునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఏవో కె.రమేష్ బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: రైతులు, మహిళలతో పాటు నిరుపేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు–1, 2 సచివాలయాల పరిధిలో సోమవారం ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. మంత్రికి సర్పంచ్ దారా రవి కిరణ్మయి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే ..సాంకేతిక కారణాలను పరిశీలించాలని వలంటీర్లకు సూచించారు. సంక్షేమ పథకాల కర పత్రాలను అందించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన న్యాయవాది దీపాల శివప్రసాద్ మంత్రి నాగార్జున సమక్షంలో పార్టీలో చేరారు.

అన్ని వర్గాలకు సమ న్యాయం..

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు గద్దె సుశీల, డొక్కు నాగకుమారి, మండల జేసీఎస్ కమిటీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్ శాస్త్రి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాస రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గాలి అరవింద, దారా చెన్నయ్య, వేల్పూరి చిన్నారి, పెరికల శ్యామ్, తూనుగుంట్ల శ్రీధర్, ఎంఏ రహమాన్, గాడల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కర్లపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఎమ్మెల్యే కోన రఘుపతి వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా మన రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల హామీలు 99శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, కో–ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, కంకిపాటి హైమావతి, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లావుల ఏడుకొండలు, మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, పఠాన్ అహ్మద్, షేక్ షంషీర్, బుర్ల సాంబయ్య, ధర్మేంద్ర, బెనర్జి, హరిరాజు, తహసీల్దారు కేశవనారాయణరావు, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ కార్యవర్గ సభ్యులకు సన్మానం

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పెద్దింటమ్మ కల్యాణ మండపంలో ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా ఎంపికైన మందపాటి పరమానంద కుమార్‌కు, కార్యవర్గ సభ్యుడిగా ఎంపికైన ఆట్ల నాగేశ్వరరెడ్డిని సన్మానించారు. నాయకులు యల్లావుల ఏడుకొండలు, పీవీ సురేష్, మల్లెల ఆదాం, మార్పు బెనర్జి, కాగిత మహేష్, సుభాష్ చంద్రబోస్, మందపాటి డేవిడ్‌రాజు, రాజేష్, ప్రశాంత్‌రాజు పాల్గొన్నారు.

రాజన్న ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న రామరాజు, వెంకటేశ్వరరెడ్డి

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన అభిమాని కూరగాయల మార్కెట్ వద్ద రాజన్న ప్రసాదం పంపిణీ చేయటం అభినందనీయమని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. వైఎస్సార్ అభిమాని కొక్కిగడ్డ రామరాజు సోమవారం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద రాజన్న ప్రసాదం పేరుతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రామరాజు మాట్లాడుతూ వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌కు వచ్చే వారికి ప్రతి సోమవారం సాంబారు, పెరుగన్నం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ అభిమానులు తాతపూడి మనోహర్, షంషీర్ పాల్గొన్నారు.

అధిక ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: నిత్యావసర వస్తువుల అధిక ధరలను తగ్గించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, నాయకులు వై.కిషోర్, కె.ఆశీర్వాదం, వి.మావో, కె.గోపి, కేవీ లక్ష్మణరావు, కె.రమేష్, జి.ధర్మరాజు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో సీపీఎం సమర భేరి

భట్టిప్రోలు: అధిక ధరలకు నిరసనగా సీపీఎం నాయకులు సమర భేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం భట్టిప్రోలు రథం సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. తహసీల్దారు డి. వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ పార్టీ మండల కార్యదర్శి జి. సుధాకర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార యాత్రకు మాజీ వైస్ ఎంపీపీ యడ్ల జయశీలరావు, కుక్కల వెంకటేశ్వరరావు, సునీల్ తదితరులు సంఘీభావం తెలిపారు. సీపీఎం నాయకులు ఎ. శ్రీనివాసరావు, టి.జసవయ్య, కె.పార్థసారథి, కె. రాంబాబు, పి. మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలను తగ్గించాలి..

కొల్లూరు: నిత్యావసరాల అధిక ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు. గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్తు చార్జీలు అధికంగా పెంచడం, విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీ త్రివేణి, ఈఓపీఆర్డీ రవికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.కృష్ణమోహన్, బి.సుబ్బారావు, టి.సురేష్, మాజీ ఎంపీపీ అమర్తలూరి కృపానందం పాల్గొన్నారు.

పంట నమోదుపై అవగాహన కల్పించాలి

రేపల్లె: ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజనా, ఈ–క్రాప్ బుకింగ్‌కు నేటి వరకు తమ వివరాలు నమోదు చేసుకోని రైతులను గుర్తించి, వారికి అవగాహన కల్పించాలని తహసీల్దారు మల్లికార్జునరావు వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్ పథకం పొందేందుకు రైతులు తమ భూమి పత్రాలను పీఎం కిసాన్ అధికార వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌కార్డులను విధిగా అనుసంధానం చేసుకోవటంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఈ–క్రాప్ బుకింగ్.. రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో ప్రమాదవశాత్తు పంట నష్టపోయిన పరిహారం పొందేందుకు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని వివరించారు. వీఆర్వోలు, వీఏఏలు బాధ్యతగా తమ పరిధిలోని రైతులు పథకాలలోకి అర్హులయ్యేలా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

కొల్లూరులో దంత వైద్య శిబిరం



కొల్లూరు : దంత సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అమరావతి బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ సునీల్ అన్నారు. కొల్లూరులోని వివేక హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. సిబార్ డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దూళిపాళ్ల రవీంద్రనాథ్ మాట్లాడుతూ, పళ్లు శుభ్రపరుచుకునే విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. వారిలో 85 మంది పలు రకాల దంత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. దంతాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 1, 2వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఉడెన్ బ్రష్‌లు, పేస్టులు పంపిణీ చేశారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్, తెనాలి రోటరీ క్లబ్, సిబార్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, అధ్యక్షుడు పావులూరు రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, సభ్యులు మల్లాది అర్జున, ఆలపాటి కిరణ్, సుంకర రామోహనబాబు, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం పాల్గొన్నారు.

దోనేపూడి ఉప సర్పంచిగా లక్ష్మీ మృదుల



లక్ష్మీ మృదులకు ఎన్నిక పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి, సర్పంచి గౌతమి



నియామక పత్రాన్ని అందుకుంటున్న సుబ్బులు



యాజలి ఉప సర్పంచ్ శ్రీనివాసరావుకు ధ్రువ పత్రం అందజేసిన డీపీవో రాంబాబు

కొల్లూరు : దోనేపూడి పంచాయతీ వైస్ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు వెనిగళ్ల లక్ష్మీ మృదుల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. ఏసయ్య తెలిపారు. గతంలో వైస్ సర్పంచ్‌గా వ్యవహరించిన వెనిగళ్ల సూర్య ప్రకాశరావు అనారోగ్యంతో ఏడాదిన్నర క్రితం మరణించారు. దీంతో వైస్ సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. గత నెలలో సూర్యప్రకాశరావు స్థానంలో జరిగిన వార్డు సభ్యుని ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడు కొల్లూరు శ్రీనివాసరావు గెలుపొందారు. అప్పట్నుంచి నిలిచి ఉన్న వైస్ సర్పంచి ఎన్నికను సోమవారం దోనేపూడి సచివాలయంలో రిటర్నింగ్ అధికారి ఎస్. ఏసయ్య, సర్పంచి వాగోలు గౌతమి సమక్షంలో నిర్వహించారు. 12 మంది వార్డు సభ్యులు ఉన్న పంచాయతీలో 10 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు వార్డు సభ్యులుగా ఉన్నారు. లక్ష్మీ మృదులను వైస్ సర్పంచిగా ప్రతిపాదించగా.. తొమ్మిది మంది వార్డు మెంబర్లు మద్దతు తెలిపారు. వైస్ సర్పంచిగా ఆమె ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏసయ్య ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. లక్ష్మీ మృదులకు సర్పంచి గౌతమి, ఇతర వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఉప సర్పంచ్‌గా సుబ్బులు

బాపట్ల అర్బన్: మండలంలోని జిల్లెల్లమూడి గ్రామ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారు మినీగల సుబ్బులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాధాకృష్ణ సోమవారం తెలిపారు.

యాజలి ఉప సర్పంచ్‌గా ఇక్కుర్తి శ్రీనివాసరావు

యాజలి(కర్లపాలెం): మండలంలోని యాజలి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఇక్కుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్‌గా ఇప్పటి వరకు పనిచేసిన ముప్పా కృష్ణంరాజు తన పదవికి రాజీనామా చేయడంతో సోమవారం ఉప సర్పంచ్ ఎన్నికను ఎన్నికల అధికారి ఎ.ఎలీషా బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో యాజలి 11వ వార్డు మెంబర్ ఇక్కుర్తి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. 10వ వార్డు మెంబరు ఎల్.వెంకటేశ్వరరావు బలపరచారు. ఎనిమిది మంది వార్డు మెంబర్లతో పాటు గ్రామ సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్ తమ మద్దతు తెలిపారు. ఇక్కుర్తి శ్రీనివాసరావు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ఎ.ఎలీషాబాబు, డీపీవో డి.రాంబాబు ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

బాపట్ల అర్బన్: భీమవరంలోని విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రేపల్లెకు చెందిన సజ్జా నందు భవాని ద్వితీయ సెమిస్టర్‌లో 9.54, 9.61 సీజీపీఏ సాధించింది. దీంతో మానవత బాపట్ల శాఖ సభ్యురాలు, ఆస్ట్రేలియాలో ఉంటున్న హిమబిందు ప్రోత్సాహకంగా విద్యార్థినికి రూ. 35వేలు ప్రకటించారు. ఆ శాఖ బాపట్ల అధ్యక్షుడు డాక్టర్ బి.శరత్‌బోస్ సోమవారం నగదును అందజేశారు. కోశాధికారి వంకాయలపాటి హరిబాబు భవానికి గతేడాది కూడా రూ. 30వేలు అందజేసినట్లు చెప్పారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు

నగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత పింఛన్‌లు అందజేస్తున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 208 పింఛన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో పింఛన్‌లు, సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకే చేరుతున్నాయని ఆయన అన్నారు.

మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్ ప్రారంభం



నిజాంపట్నం: వినియోగదారులకు నాణ్యమైన చేపలను తక్కువ ధరలకు విక్రయించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్ అందజేస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు అన్నారు. నిజాంపట్నంలో సోమవారం బొమ్మిడి వెంకట సుబ్బారావు మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఒక యూనిట్ ఖరీదు రూ.3.25లక్షలని తెలిపారు. బీసీలకు 40శాతం సబ్సిడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



కోటిపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొల్లూరు: అనారోగ్య సమస్యలను అరికట్టాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి అన్నారు. సోమవారం దోనేపూడి శివారు కోటిపల్లి అంగన్‌వాడీ–2 కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. ఆకు కూరల ద్వారా తక్కువ ఖర్చుతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న బలవర్ధక ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా నిర్దేశిత సమయాల్లో స్వీకరించడం ద్వారా రక్త హీనతను అధికమించవచ్చని చెప్పారు. పౌష్టికాహారం సకాలంలో అందేలా.. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్.రాణి పాల్గొన్నారు.